సాక్షి రంగారెడ్డి

శుక్రవారం। 9। ఫిబ్రవరి। 2024



అభివృద్ధికి సహకరించాలి

కేరళ రాష్ట్ర అభివృద్ధికి గవర్నర్ పూర్తి స్థాయిలో సహకరించాలని సీపీఎం నేతలు డిమాండ్ చేశారు. 8లో▸



సెలవు దినంగా ప్రకటించాలి

సంత్‌శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతిని సెలవు దినంగా ప్రకటించాలని సేవాలాల్ సేన నాయకులు డిమాండ్ చేశారు. 8లో▸



నిలిచిన సబ్సిడీ

రాయితీపై వ్యవసాయ పరికరాల పంపిణీ నిలిచిపోయింది. నిధుల కొరతతో ప్రభుత్వ పథకాలు అందని ద్రాక్షగా మారాయి. 8లో▸

న్యూస్‌రీల్

నేడు కబడ్డీ క్రీడాకారుల ఎంపిక పోటీలు

హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం కబడ్డీ గ్రౌండ్‌లో శుక్రవారం జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో సబ్ జూనియర్ బాలురు, బాలికల జిల్లా జట్లకు ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.రవికుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జట్టుకు ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 16 నుంచి 19 వరకు సూర్యాపేటలో నిర్వహించే 33వ అంతర్ జిల్లా కబడ్డీ పోటీల్లో జిల్లా తరఫున పాల్గొంటారని తెలిపారు.జిల్లా సబ్ జూనియర్ కబడ్డీ ఎంపిక పోటీలకు హాజరయ్యేందుకు 55 కిలోల బరువు,16 సంవత్సరాల లోపు వాళ్లకే అర్హత ఉందన్నారు. ఆధార్‌కార్డును వెంట తీసుకురావాలన్నారు. వివరాలకు 76619 92581, 90000 38272 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

వెంకట క్రాంతికిరణ్‌కు రాష్ట్రస్థాయి సేవా పురస్కారం



కడ్తాల్: మండల పరిధిలోని రావిచేడ్ గ్రామానికి చెందిన పుట్టపాక వెంకట క్రాంతికిరణ్‌కు రాష్ట్రస్థాయి సేవా పురస్కారం లభించింది. పినాకిని మీడియా ఏటా వివిధ రంగాల్లో సేవలందించిన వారికి పురస్కారాలు అందజేస్తోంది. ఇందులో భాగంగా సేవా రంగంలో అందించిన సేవలకు గాను వెంకట క్రాంతికిరణ్‌ను ఎంపిక చేసింది. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన కార్యక్రమంలో వివిధ రంగాల ప్రముఖుల సమక్షంలో క్రాంతికిరణ్‌కు అవార్డు అందజేశారు. క్రాంతి కిరణ్‌కు అవార్డు రావడంపై గ్రామస్తులతోపాటు పలువురు అభినందించారు.

11న గురుకుల ప్రవేశ పరీక్ష



షాద్‌నగర్‌రూరల్: తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి 5వ తరగతిలో చేరేందుకు ఈ నెల 11న ప్రవేశ పరీక్ష నిర్వహించడం జరుగుతుందని కమ్మదనం గురుకుల పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ హేమలత గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పరీక్ష కొనసాగుతుందని తెలిపారు. టీటీడబ్ల్యూఆర్ఎస్, టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్, మహాత్మాజ్యోతిబాపూలే గురుకుల పాఠశాల, టీఎంఆర్‌ఈఐఎస్‌ఈ గురుకులాల్లో ప్రవేశం పొందేందుకు పరీక్ష నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. పరీక్షల్లో సాధించిన మెరిట్ లిస్టు ప్రకారం విద్యార్థుల ఎంపిక ఉంటుందన్నారు. పరీక్షకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఆన్‌లైన్‌లో హాల్‌టికెట్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులను ఉదయం 10 గంటలకు పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తారని.. ఉదయం 9.30 గంటల వరకు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని చెప్పారు. ఆధార్‌కార్డు, బోనఫైడ్, హాల్ టికెట్, బ్లూ, బ్లాక్ పెన్ను తెచ్చుకోవాలని సూచించారు.

జీహెచ్‌ఎంసీకి రూ. 200 కోట్లు

- భూ సేకరణల నిమిత్తం
- బడ్జెట్ రిలీజ్ ఉత్తర్వు జారీ

సాక్షి, సిటీబ్యూరో: భూ సేకరణల కోసం ప్రభుత్వం జీహెచ్‌ఎంసీకి రూ. 200 కోట్ల బడ్జెట్‌ను విడుదల చేసింది. ఈ మేరకు మున్సిపల్ పరిపాలన శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిశోర్ ఉత్తర్వు జారీ చేశారు. 2023– 24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఈ బడ్జెట్ రిలీజ్ ఆర్డర్ (బీఆర్ఓ)ను జారీ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జీహెచ్‌ఎంసీకి ఈ నిధులు విడుదల చేసింది. గతంలో బీఆర్ఎస్ హయాంలో ప్రత్యేకంగా భూసేకరణల కోసమంటూ నిధులు విడుదల కాలేదు. జీహెచ్‌ఎంసీలో ఎస్సార్‌డీపీ, తదితర పథకాల కింద చేపట్టిన పనులు పురోగతిలో ఉన్నాయి. అప్పట్లో టౌన్‌ప్లానింగ్ టీడీఆర్‌ల ద్వారానే భూసేకరణల పరిహారం ఎక్కువగా చెల్లించారు. కొంతకాలంగా టీడీఆర్‌లకు డిమాండ్ తగ్గిపోయింది. కొన్ని ప్రాంతాల్లో భూసేకరణలు పూర్తికాక పనులు ముందుకు సాగడం లేదు. జూపార్క్ నుంచి ఆరాంఘర్ వరకు జరుగుతున్న ఫ్లై ఓవర్‌తో సహా మరికొన్ని ప్రాంతాల్లో భూసేకరణ సమస్యలున్నాయి. జీహెచ్‌ఎంసీ ఖజానాలో నిధులు లేనందున భూసేకరణలో జాప్యం జరుగుతోంది. ఈ విషయాన్ని వివరిస్తూ జీహెచ్‌ఎంసీ ప్రభుత్వానికి లేఖ రాసింది. ఇటీవల కమిషనర్ ప్రభుత్వంతో జరిపిన సంప్రదింపుల్లో ఈ విషయాన్ని దృష్టికి తెచ్చినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం భూసేకరణల కోసం ఈ నిధులు విడుదల చేసింది. ఈ మేరకు జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు పరిపాలన అనుమతులు మంజూరు చేసింది.

బలగం ఎటువైపో..!

ఆదిబట్ల మున్సిపాలిటీలో నేడు బలపరీక్ష

- చైర్మన్ రేసులో మర్రి నిరంజన్‌రెడ్డి
- మెజార్టీ కౌన్సిలర్లంతా ఆయన వైపే..
- ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ సస్పెన్షన్ వేటు
- ఆర్తిక చైర్‌పర్సన్ కుర్చీ నిలబెట్టుకునేనా?

ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల మున్సిపాలిటీలో బలపరీక్షకు రంగం సిద్ధమైంది. అధికార పార్టీలో ధిక్కార స్వరం వినిపించడంతో ఇప్పటికే ఓ కౌన్సిలర్‌పై కాంగ్రెస్ పార్టీ వేటు వేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో బలపరీక్ష నెగ్గుతుందా లేక వీగుతుందా అన్న ఉత్కంఠ నెలకొంది. ఎలాగైనా పంతం నెగ్గించుకోవాలని పాలకవర్గ సభ్యులంతా ఒక్కటయ్యారు. కౌన్సిలర్లంతా చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్‌పై గుర్రుగా ఉన్నారు. 13 మంది కౌన్సిలర్లు ఏకగ్రీవ తీర్మానంతో చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్‌ను తొలగించాలని కోరుతూ జనవరి 5న కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

ఒకరిద్దరు మినహాయిస్తే..

మున్సిపాలిటీలో 15 మంది కౌన్సిలర్లు ఉన్నారు. మరో ఐదుగురు ఎక్స్ అఫీషియో సభ్యులు ఉన్నారు. ఇప్పటి వరకు చైర్‌పర్సన్‌గా ఆర్తికగౌడ్, వైస్ చైర్‌పర్సన్‌గా కోరె కళమ్మ ఉన్నారు. వీరిని తొలగించడానికి కౌన్సిలర్లు నోటీసులు అందజేశారు. ప్రస్తుతం చైర్మన్ రేసులో 9వ వార్డు కౌన్సిలర్ మర్రి నిరంజన్‌రెడ్డి ఉన్నారు. బీఆర్ఎస్ నుంచి ఏడుగురు, కాంగ్రెస్ నుంచి ఏడుగురు, బీజేపీ నుంచి ఒకరు సభ్యులు ఉండగా వీరిలో చైర్మన్ (కాంగ్రెస్), వైస్ చైర్మన్ (బీఆర్ఎస్) మినహాయిస్తే మొత్తం సభ్యులు నిరంజన్‌రెడ్డి వైపే ఉన్నారు.

క్యాంపు నుంచి నేడు రాక..

గత నెల 14వ తేదీ నుంచి నేటి వరకు కౌన్సిలర్లు క్యాంపునకు తరలివెళ్లారు. సంక్రాంతి నుంచి ఆంధ్ర, కోనసీమ ప్రాంతాల్లో పర్యటించారు. అనంతరం బెంగళూర్‌తో పాటు ఊటీ, తమిళనాడు, కర్ణాటక, మైసూర్ వెళ్లిన వారు శుక్రవారం ప్రత్యేక సమావేశం ఉండటంతో నేరుగా ఆదిబట్లకు రానున్నారు.

భారీగా ఏర్పాట్లు.. పటిష్ట బందోబస్తు

మున్సిపాలిటీ అవిశ్వాసంపై శుక్రవారం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయనున్నారు. ప్రత్యేక అధికారిగా ఇప్పటికే కలెక్టర్ ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంతరెడ్డిని నియమించారు. ఆయన ఏర్పాట్లను దగ్గరుండి చూసుకున్నారు. సీఐ రాఘవేందర్‌రెడ్డి ఎలాంటి గొడవలు, ఘర్షణలు చోటు చేసుకోకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేశారు. సమావేశ మందిరంలో, బయట బారికేడ్లు ఏర్పాటు చేశారు. గతంలో చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక సమయంలో జరిగినట్లు ఎలాంటి గొడవలు జరగకుండా చూస్తున్నారు. ఉదయం 10.30 గంటలకు చైర్‌పర్సన్‌పై, మధ్యాహ్నం 12.30 గంటలకు వైస్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాస సమావేశం నిర్వహించనున్నారు.



ఆదిబట్ల మున్సిపల్ కార్యాలయం వద్ద ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఆర్డీవో అనంతరెడ్డి, సీఐ రాఘవేందర్‌రెడ్డి

విప్..గిప్ జానా్త నై

నేడు జరగబోయే బలపరీక్షలో ప్రస్తుతం ఉన్న చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్‌ను తొలగించడానికి అధికార, విపక్ష పార్టీలు కౌన్సిలర్లకు విప్ జారీ చేయనున్నాయి. ఇప్పటికే పార్టీ నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరించాడంటూ మర్రి నిరంజన్‌రెడ్డిని కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. ఆయన బాటలోనే మరి కొందరు కౌన్సిలర్లపై చర్యలు తప్పవని అధిష్టానం హెచ్చరిస్తున్నప్పటికీ అవేవీ లెక్క చేయడం లేదు. మర్రికే తమ మద్దతు అంటూ బాహాటంగా ప్రకటిస్తున్నారు. అదే జరిగితే చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ పని అయిపోయినట్లేనని అంటున్నారు. మరి నెగ్గుతారో, వీగుతారో చూడాలి. ఒకవేళ నెగ్గితే మళ్లీ చైర్మన్ ఎన్నిక ఎప్పుడో వేచి చూడాల్సిందే.

నిబంధనలు పాటించాలి

ఆర్డీవో, ప్రిసైడింగ్ అధికారి అనంతరెడ్డి


ఇబ్రహీంపట్నం: ఆదిబట్ల, ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీల చైర్ పర్సన్, వైస్‌చైర్‌పర్సన్లపై పెట్టిన అవిశ్వాస సమావేశాలకు నిర్ణీత సమయానికి కౌన్సిలర్లు హాజరు కావాలని.. నియమ నిబంధనలు పాటించాలని ఆర్డీవో, ప్రిసైడింగ్ అధికారి అనంతరెడ్డి తెలిపారు. స్థానిక రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో గురువారం ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. ఆదిబట్ల మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్‌చైర్‌పర్సన్‌పై శుక్రవారం అవిశ్వాస సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 10.30 గంటలకు కౌన్సిలర్లు హాజరుకావాలని అన్నారు. 2/3 మెజార్టీ కౌన్సిలర్లు వస్తేనే సమావేశం నిర్వహిస్తామని చెప్పారు. సమావేశం ప్రారంభమైన అరగంటలోపు కౌన్సిలర్ల కోసం నిరీక్షిస్తామని.. రానిపక్షంలో సమావేశం వాయిదా వేస్తామన్నారు. తిరిగి అదేరోజు మరో అవకాశం కల్పిస్తామన్నారు. అప్పుడు కూడా అర గంట మాత్రమే సమయం ఉంటుందన్నారు. ఈలోపు కౌన్సిలర్లు హాజరై వారు ఇచ్చిన అవిశ్వాస నోటీసులపై ఓటింగ్‌లో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. సమావేశంలో ముందుగా చైర్‌పర్సన్‌ను బలపరిచే కౌన్సిలర్లు, అనంతరం వ్యతిరేకించే కౌన్సిలర్లు, తటస్థ వైఖరి అవలంబించే కౌన్సిలర్లను కౌంటింగ్ చేస్తామని వివరించారు.

16న పట్నం మున్సిపాలిటీలో..

ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్ పర్సన్‌పై వచ్చిన అవిశ్వాస నోటీసులకు సంబంధించిన సమావేశాన్ని ఈనెల 16న నిర్వహిస్తున్నట్లు ఆర్డీవో తెలిపారు. ఆదిబట్లకు పాటించిన నియమ, నిబంధనలే ఈ మున్సిపాటికీ వర్తిస్తాయని చెప్పారు. చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, సంబంధిత అధికారులను మాత్రమే సమావేశ హాల్‌లోకి అనుమతిస్తామని పేర్కొన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా, శాంతియుతంగా అవిశ్వాస ప్రక్రియ నిర్వహించేందుకు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తామని తెలిపారు.

35,91,987

- జిల్లాలో తేలిన ఓటర్ల లెక్క
- తుది ఓటరు జాబితా విడుదల
- వివరాలు వెల్లడించిన కలెక్టర్ శశాంక



సాక్షి, రంగారెడ్డిజిల్లా : ఎన్నికల సంఘం ఆదేశాలకు అనుగుణంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె.శశాంక గురువారం తుది ఓటరు జాబితాను విడుదల చేశారు. జిల్లా పరిధిలోని ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాల్లో మొత్తం 35,91,987 మంది ఓటర్లు ఉన్నారని వెల్లడించారు. వీరిలో 18,50,292 మంది పురుష ఓటర్లు ఉండగా, 17,40,379 మంది మహిళా ఓటర్లు, 449 మంది థర్డ్ జెండర్స్ ఉన్నారని చెప్పారు. 286 మంది ఎన్ఆర్ఐ ఓటర్లలో 230 మంది పురుషులు, 56 మంది మహిళలు ఉన్నారని, 581 మంది సర్వీస్ ఓటర్లలో పురుషులు 543 మంది, మహిళలు 38 మంది ఉన్నారని తెలిపారు. ఎస్ఎస్ఆర్ – 2024 కార్యక్రమంలో భాగంగా జనవరి 22 వరకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించి తుది ఓటరు జాబితాను రూపొందించినట్లు కలెక్టర్ స్పష్టం చేశారు. తుది ఓటరు జాబితాను అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలోని బూత్ లెవెల్ అధికారుల వద్ద, సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారులుగా వ్యవహరించే తహసీల్దార్, రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లో అందుబాటులో ఉంచినట్లు చెప్పారు.

నియోజకవర్గాల వారీగా ఇలా..

- ఇబ్రహీంపట్నం పరిధిలో 1,69,713 పురుష ఓటర్లు, 1,67,298 మహిళా ఓటర్లు, థర్డ్ జెండర్స్ 36 మంది, 32 మంది ఎన్ఆర్ఐ ఓటర్లు, 55 మంది సర్వీస్ ఓటర్లు ఉన్నారు. మొత్తం 3,37,047 మంది ఓటర్లు ఉన్నారు.
- ఎల్బీ నగర్ పరిధిలో 3,12,163 మంది పురుష ఓటర్లు, 2,88,153 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. థర్డ్ జెండర్స్ 134 మంది, 52 మంది ఎన్ఆర్ఐలు, 50 మంది సర్వీస్ ఓటర్లను కలుపుకొని 6,00,450 మంది ఓటర్లు ఉన్నారు.
- మహేశ్వరం పరిధిలో 2,84,913 మంది పురుష ఓటర్లు, 2,70,996 మంది మహిళా ఓటర్లు, థర్డ్ జెండర్స్ 69 మంది, 59 మంది ఎన్ఆర్ఐ, 73 మంది సర్వీస్ ఓటర్లు కలిపి మొత్తం 5,55,978 మంది ఓటర్లు ఉన్నారు.
- రాజేంద్రనగర్ పరిధిలో 3,10,863 మంది పురుష ఓటర్లు, 2,88,684 మంది మహిళా ఓటర్లు, థర్డ్ జెండర్స్ 38 మంది, 102 మంది ఎన్ఆర్ఐలు, 91 మంది సర్వీస్ ఓటర్లను కలుపుకొని 5,99,585 మంది ఉన్నారు.
- శేరిలింగంపల్లి పరిధిలో 3,95,460 మంది పురుషులు, 3,52,069 మంది మహిళలు, థర్డ్ జెండర్స్ 144 మంది, 34 మంది ఎన్ఆర్ఐ, 50 మంది సర్వీస్ ఓటర్లు కలిసి మొత్తం 7,47,673 మంది ఓటర్లు ఉన్నారు.
- చేవెళ్ల పరిధిలో 1,35,261 మంది పురుష ఓటర్లు, 1,33,820 మంది మహిళలు, థర్డ్ జెండర్స్ ఆరుగురు, ఐదుగురు ఎన్ఆర్ఐలు, 74 మంది సర్వీస్ ఓటర్లను కలుపుకొని 2,69,087 మంది ఓటర్లు ఉన్నారు.
- కల్వకుర్తి పరిధిలో 1,22,805 మంది పురుషులు, 1,20,148 మంది మహిళలు, థర్డ్ జెండర్స్ 9 మంది, ఇద్దరు ఎన్ఆర్ఐలు, 134 మంది సర్వీస్ ఓటర్లను కలిపి మొత్తం 2,42,962 మంది ఓటర్లు ఉన్నారు.
- షాదనగర్ పరిధిలో 1,19,114 మంది పురుష ఓటర్లు, 1,19,211 మంది మహిళలు, థర్డ్ జెండర్స్ 13 మంది, 54 మంది సర్వీస్ ఓటర్లను కలుపుకొని 2,38,338 మంది ఉన్నారు.

పుస్తకాల పండగ వచ్చేసింది



స్టాళ్ల కోసం ఏర్పాట్లు

- నేటినుంచి ఎన్టీఆర్ స్టేడియం వేదికగా..
- హైదరాబాద్ జాతీయ పుస్తక ప్రదర్శన
- 365 స్టాళ్లలో కొలువుదీరనున్న విభిన్న భాషల గ్రంథాలు

సాక్షి, సిటీబ్యూరో: పుస్తక ప్రియులకు పండగే. చదువరులకు ఇక వరమే. ప్రతి సంవత్సరం ప్రతిష్టాత్మకంగా నిర్వహించే హైదరాబాద్ జాతీయ పుస్తక ప్రదర్శన వచ్చేసింది. ఏటా డిసెంబర్ చివరి 10 రోజుల పాటు నిర్వహించే ప్రదర్శన ఈసారి ఎన్నికలు, ఇతరత్రా కారణాలతో రెండు నెలలు ఆలస్యమైంది. నగరంలోని ఎన్టీఆర్ స్టేడియంలో శుక్రవారం సాయంత్రం పుస్తక ప్రదర్శన ప్రారంభం కానుంది. ఈ నెల 19 తేదీ వరకు కొనసాగనుంది. చదువరి చెంతకు పుస్తకంఅనే లక్ష్యంతో హైదరాబాద్ బుక్ ఫెయిర్ సొసైటీ ఏడేళ్లుగా ఈ పుస్తక ప్రదర్శనను నిర్వహిస్తోంది. ఏటా 6 నుంచి 7 లక్షల మందికి పైగా పుస్తకప్రియులు ప్రదర్శనలో పాల్గొంటున్నారు. నచ్చిన పుస్తకాలను కొనుగోలు చేస్తున్నారు. జాతీయ, అంతర్జాతీయ సమకాలీన అంశాలతో పాటు చరిత్ర, సామాజిక, తత్వశాస్త్రాలు, విజ్ఞాన గ్రంథాలకు పాఠకాదరణ పెరిగింది. మరోవైపు పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థుల కోసం కొన్ని ప్రచురణ సంస్థలు ప్రతి సంవత్సరం ప్రత్యేకంగా పుస్తకాలను ముద్రించి అందుబాటులోకి తెస్తున్నాయి. ఒక్క హైదరాబాద్‌లోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా పుస్తకాలకు ఆదరణ పెరిగిందని పలు సర్వేలు పేర్కొంటున్నాయి. కోల్‌కతాలో గత జనవరిలో నిర్వహించిన పుస్తక ప్రదర్శనలో సుమారు 29 లక్షల మంది పాల్గొన్నట్లు అంచనా. హైదరాబాద్ పుస్తక ప్రదర్శనకు సైతం ప్రతి సంవత్సరం పాఠకుల నుంచి అనూహ్యమైన స్పందన లభిస్తోంది. ఏటా లక్షలాది పుస్తకాలు అమ్ముడవుతున్నాయి.

డిజిటల్ మీడియా వెల్లువలోనూ..

సోషల్ మీడియా, డిజిటల్ మీడియా వెల్లువలోనూ పుస్తకానికి విశేషమైన ఆదరణ లభిస్తోంది. సామాజిక చింతనకు, ప్రాపంచిక దృక్పథాన్ని అలవర్చుకొనేందుకు సాహిత్య అధ్యయనం ఒకటే మార్గం. సాహిత్యాన్ని జీవితంలో భాగంగా చేసుకున్నవాళ్లే గొప్ప విజేతలుగా నిలుస్తారు. అలాంటి అభిరుచి కలిగిన పాఠకులు కోట్లాది మంది ఉన్నారు అని హైదరాబాద్ బుక్ ఎగ్జిబిషన్ సొసైటీ అధ్యక్షుడు జూలూరు గౌరీశంకర్ అభిప్రాయపడ్డారు. సామాజిక మాధ్యమాలు ఉధృతంగా వెల్లువెత్తినా ఏడేళ్లుగా పుస్తక ప్రదర్శనలు విజయవంతంగా కొనసాగడం, లక్షలాది పుస్తకాలు అమ్ముడు కావడమే ఇందుకు నిదర్శనమని చెప్పారు. మరోవైపు ప్రతి సంవత్సరం వందల కొద్దీ కొత్త పుస్తకాలు కూడా అందుబాటులోకి వస్తున్నాయి. పుస్తక ప్రదర్శన స్ఫూర్తితో ఎంతోమంది రచయితలు తమ సృజనాత్మకతకు పదును పెట్టుకుంటున్నారు. ఈసారి పుస్తక ప్రదర్శనలో సదస్సులు, చర్చలు, సాంస్కృతిక కార్యక్రమాలు కూడా నిర్వహించనున్నారు. కవులు, రచయితలు, కళాకారులు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. ఈ సంవత్సరం 365 స్టాళ్లను ఏర్పాటు చేశారు. ఉత్తర, దక్షిణాది రాష్ట్రాలకు చెందిన వందలాది పుస్తక ప్రచురణ సంస్థలు ప్రదర్శనలో పాల్గొననున్నాయి.

పిల్లలకు ప్రత్యేక పోటీలు..

బాల వికాస్ కార్యక్రమాల్లో భాగంగా పిల్లలకు వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు, శని, ఆదివారాల్లో మధ్యాహ్నం 1 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఈ పోటీలు ఉంటాయి. జానపద నృత్యాలు, ఫ్యాన్సీడ్రెస్ పోటీలు, క్విజ్, మాట్లాడే బొమ్మ, పిల్లల గ్రంథాలయాల ఆవశ్యకతపై చర్చ, హస్తకళల వర్క్‌షాపు, గ్రూప్‌డ్యాన్స్, సోలోడ్యాన్స్, పాటలు, పద్యాలు, పెయింటింగ్, స్టోరీ టెల్లింగ్ తదితర అంశాల్లో పోటీలు నిర్వహించనున్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులకు ప్రవేశం ఉచితం. ఇతరులకు ప్రవేశ రుసుము రూ.10. పుస్తక మహోత్సవంలో భాగంగా సాంస్కృతిక, కళారూపాలను ప్రదర్శించనున్నారు. పుస్తక ప్రదర్శన ప్రతిరోజూ మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 8.30 గంటల వరకు, శని, ఆదివారాల్లో మధ్యాహ్నం 1 నుంచి రాత్రి 9 గంటల వరకు ఉంటుంది.

ప్రోత్సాహంతోనే ఉత్తమ ఫలితాలు

కాచిగూడ: ఉద్యోగులకు ప్రోత్సాహం అందించడం ద్వారా ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని ఆర్టీసీ హైదరాబాద్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. ఆర్టీసీలో ఉత్తమ ఫలితాలు సాధించిన ఉద్యోగులకు గురువారం ఆర్టీసీ కాచిగూడ డిపోలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రీజినల్ స్థాయిలో ఆర్టీసీ ప్రగతి చక్రం పేరుతో త్రైమాసిక పురస్కారాలను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఈడీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకాన్ని విజయవంతం చేయడంలో ఆర్టీసీ ఉద్యోగుల పాత్ర మరువలేనిదన్నారు.

షాద్‌నగర్ డిగ్రీ కళాశాలకు న్యాక్ గుర్తింపు



ఆనందం వ్యక్తం చేస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

షాద్‌నగర్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు న్యాక్ (నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్) గుర్తింపు లభించింది. గత నెల 30, 31 తేదీల్లో న్యాక్ బృందం కళాశాలను సందర్శించింది. కళాశాలలో విద్యార్థులకు కల్పిస్తున్న మౌలిక సదుపాయాలు, విద్యా ప్రమాణాలు, కళాశాల నిర్వహణ తదితర అంశాలను బృందం సభ్యులు క్షుణ్ణంగా పరిశీలించారు. కళాశాలలో చదువుతున్న విద్యార్థులతో పాటు, వారి తల్లిదండ్రులతో సమావేశమై వివరాలు సేకరించారు. కళాశాలలోని కంప్యూటర్ ల్యాబ్, ప్రయోగశాలలు, గ్రంథాలయం, తాగునీటి ప్లాంట్‌ను పరిశీలించారు. వారి నివేదిక ఆధారంగా కళాశాలకు బీ ప్లస్ గ్రేడ్ లభించింది. దీంతో కళాశాలలో మరిన్ని మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కానున్నాయి. కళాశాలకు న్యాక్ గుర్తింపు రావడంపై కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కమల, వైస్ ప్రిన్సిపాల్ భాను ప్రకాష్ హర్షం వ్యక్తం చేశారు.

ఇస్తారో.. ఇవ్వరో!

ఉచిత విద్యుత్.. వంట గ్యాస్



- ఆరు గ్యారంటీల దరఖాస్తుదారుల్లో ఉత్కంఠ
- అధికారుల సర్వేతో అంతటా ఇదే చర్చ
- అర్హతలు.. తీసివేతలు.. కూడికలపై సందిగ్ధత
- గ్యారంటీకి 'రేషన్ కార్డు' అర్హత తప్పనిసరి
- గ్రేటర్‌లో 17.21 లక్షల కుటుంబాలకు లబ్ధి
- సరిహద్దు జిల్లా కార్డుదారులు ఐదు లక్షలపైనే..
- కార్డు లేని కుటుంబాలు మరో పది లక్షలు



కుటుంబాలు 40 లక్షల పైనే

మహా నగరం మొత్తమ్మీద సుమారు 40 లక్షల పైగానే కుటుంబాలు ఉన్నట్లు అంచనా. విద్యుత్ కనెక్షన్లు 56 లక్షలపైనే ఉన్నాయి. వంట గ్యాస్ కనెక్షన్లు సుమారు 30 లక్షల వరకు ఉన్నట్లు ఆయిల్ కంపెనీల గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. మొత్తం కుటుంబాల్లో ఆదాయ వర్గాలకు సంబంధించిన 10 లక్షలు మినహా మిగిలిన 30 లక్షల కుటుంబాలు పేద, మధ్య తరగతి వర్గాలు ఉన్నట్లు సమాచారం.

సాక్షి, సిటీబ్యూరో: కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయనున్న గ్యారంటీ పథకాలన్నింటికీ తెల్ల రేషన్ కార్డు ప్రామాణికంగా మారింది. తాజాగా ఉచిత విద్యుత్, రూ.500కు వంట గ్యాస్ సిలిండర్ల లబ్ధిదారుల ఎంపికకు అధికారులు కసరత్తు ముమ్మరం చేశారు. ఈ నేపథ్యంలో గ్రేటర్‌లో ఈ రెండు గ్యారంటీలపై చర్చలు మొదలయ్యాయి. వీటికోసం దరఖాస్తు చేసుకున్న వారంతా తమకు పథకం వర్తిస్తుందా? లేదా? అని ఆరా తీస్తున్నారు. కొందరు ఆఫీసులు చుట్టూ తిరుగుతున్నారు. మరికొందరు తెలిసిన వాళ్ల ద్వారా వివరాలు సేకరిస్తున్నారు. ముఖ్యంగా విద్యుత్ పథకం ఇళ్ల ఓనర్లు, అద్దెకున్న వాళ్లకు ఎలా ఇస్తారో తెలియక అయోమయానికి గురవుతున్నారు. ఈ పథకాలకు రేషన్ కార్డును ప్రామాణికంగా తీసుకోనున్నారు. ఇటీవల ఉచిత విద్యుత్ కోసం ఇంటింటికీ వెళ్లి ఆధార్ కార్డుతో పాటు రేషన్ కార్డు నంబర్ తప్పనిసరిగా సేకరించడం ఇందుకు బలం చేకూర్చుతోంది. అదేవిధంగా త్వరలో గ్యాస్ సిలిండర్ల కోసం కూడా రేషన్ కార్డు నంబర్ స్వీకరించనున్నారు. రేషన్‌కార్డులు లేని కుటుంబాల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. మరోవైపు ఇతర జిల్లాల్లో రేషన్‌కార్డులు కలిగి నగరంలో అద్దె ఇళ్లలో నివాసం ఉంటున్న కుటుంబాలపై కూడా స్పష్టత కరువైంది.

ఇదీ పరిస్థితి..

హైదరాబాద్, రంగారెడ్డి జిల్లా, మేడ్చల్– మల్కాజిగిరి జిల్లాలో ఆహార భద్రత (రేషన్ కార్డు) కలిగిన కుటుంబాలు 17.21 లక్షల వరకు ఉన్నట్లు పౌర సరఫరాల శాఖ అధికార గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. సరిహద్దు జిల్లాల నుంచి వచ్చి నగరంలో నివాసం ఉంటున్న మరో ఐదు లక్షల వరకు కుటుంబాలు రేషన్ కార్డులు కలిగి ఉన్నాయి.

కొత్త రేషన్ కార్డుల కోసం..

గ్రేటర్ పరిధిలో కొత్త రేషన్ కార్డుల కోసం ప్రజాపాలనలో సుమారు 5,73,069 దరఖాస్తులు వచ్చాయి. వాస్తవంగా గత పదేళ్లలో కేవలం 1.27 లక్షల కొత్త రేషన్ కార్డులు మాత్రమే మంజూరయ్యాయి. పెళ్లిలతో కొత్తగా ఏర్పాటై చాలా కుటుంబాలకు రేషన్ కార్డులు లేవు. అలాంటి కుటుంబాలు సుమారు 10 లక్షల వరకు ఉండొచ్చని అంచనా. అందులో సగం కుటుంబాల వరకు కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు చేసుకున్నట్లు తెలుస్తోంది.

ప్రజాపాలనలో..

హైదరాబాద్ మహానగర పరిధిలోని సుమారు 24 లక్షల 74 వేల 325 కుటుంబాలు దరఖాస్తు చేసుకున్నాయి. అందులో ఐదు పథకాల కోసం సుమారు 19,01,256 కుటుంబాలు, రేషన్ కార్డు, ఇతరత్రా కోసం 5,73,069 కుటుంబాలు దరఖాస్తు చేసుకున్నట్లు అధికారిక గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

కేరళ అభివృద్ధికి గవర్నర్ సహకరించాలి

సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు రాజు



ధర్నాకు తరలివెళ్లిన నేతలు

షాద్‌నగర్: కేరళలో ఎల్డీఎఫ్ ప్రభుత్వాన్ని ఇబ్బందులకు గురి చేసే విధంగా ఆరాష్ట్ర గవర్నర్ వ్యవహరించడం సరికాదని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎస్.రాజు అన్నారు. కేరళ గవర్నర్ వైఖరిని నిరసిస్తూ గురువారం సీపీఎం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద ధర్నా చేపట్టారు. ఈ ధర్నాకు షాద్‌నగర్ నుంచి సీపీఎం నాయకులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఎస్.రాజు మాట్లాడుతూ.. కేరళలో ఎల్డీఎఫ్ వామపక్ష ప్రభుత్వం అసెంబ్లీలో ఆమోదింపజేసుకున్న బిల్లులను గవర్నర్ తిరిగి పంపడం సరికాదన్నారు. ప్రభుత్వాన్ని ఇబ్బందులకు గురి చేసే విధంగా గవర్నర్ వ్యవహరిస్తుందని అన్నారు. రాష్ట్ర అభివృద్ధికి కట్టుబడి ప్రభుత్వం కార్యక్రమాలు చేపడుతుందని అన్నారు. కేరళ రాష్ట్ర అభివృద్ధికి గవర్నర్ పూర్తి స్థాయిలో సహకరించాలన్నారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ధర్నాకు తరలివెళ్లిన వారిలో శ్రీను నాయక్, శివ, శ్రీకాంత్, బేరి శ్రీనివాస్, రాయికంటి గోపాల్, లక్ష్మీ తదితరులున్నారు.

నిలిచిన సబ్సిడీ



గొల్లూరుగూడలో డ్రిప్‌తో టమాటా సాగు

రాయితీపై వ్యవసాయ పరికరాల పంపిణీ నిలిచిపోయింది. నిధుల కొరతతో రైతులకు ప్రభుత్వ పథకాలు అందని ద్రాక్షగా మారాయి. బిందు సేద్యానికి కావాల్సిన పరికరాలకు దరఖాస్తు చేసుకోగా నేటికీ పెండింగ్‌లోనే ఉన్నాయి.

- ఐదేళ్లుగా రాయితీపై పరికరాల కొనుగోలుకు ఎదురుచూపులు
- ప్రస్తుతం ఆయిల్ పామ్ సాగు రైతులకే అందజేత
- పండ్లతోటలకు అంతంత మాత్రమే
- ఇబ్బంది పడుతున్న అన్నదాతలు

షాబాద్: రాష్ట్రంలో సబ్సిడీ డ్రిప్ పరికరాల కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వమైనా పథకం అమలుకు చర్యలు తీసుకుంటుందేమోనని ఆశతో ఉన్నారు. బిందు సేద్యం ద్వారా పంటలకు నీటి తడులు అందించేందుకు వీలుగా ప్రభుత్వం సబ్సిడీపై అందించే డ్రిప్ పరికరాల పథకం ఐదేళ్లుగా నిలిచిపోయింది. బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ పథకా న్ని పరిమితం చేయడంతో రైతులు ఇబ్బందులు ప డుతూ వస్తున్నారు. దీంతో పంటల సాగు రైతులకు భారంగా మారింది. రెండు దశాబ్దాల కాలంగా రైతులకు అవగాహన కల్పించి స్ప్రింక్లర్ల విధానంలో పంట సాగును ప్రభుత్వాలు ప్రోత్సహించాయి. ఎస్సీ, ఎస్టీ రైతులకు వంద శాతం, చిన్న, సన్న కారు రైతులకు 90 శాతం సబ్సిడీ ఇవ్వగా..పెద్ద రైతులకు 12 ఎకరాలకే పరిమితం చేయడంతో పాటు 80 శాతం మేర సబ్సిడీ ఇస్తూ వచ్చింది.

ఆయిల్‌పామ్ సాగుకు మాత్రమే

ప్రస్తుతం సబ్సిడీ కింద అందిస్తున్న డ్రిప్ పథకాన్ని ప్రభుత్వం కేవలం ఆయిల్ పంటల సాగుకే పరిమితం చేసింది. ఈ ఏడాది జిల్లాలో 6,800 వేల ఎకరాల్లో ఆయిల్ పామ్‌ను సాగులోకి తేవాలని లక్ష్యంగా పెట్టుకున్నందున ఈ పంట సాగుకు ముందుకు వచ్చే రైతులకు మాత్రమే సబ్సిడీపై స్ప్రింక్లర్లు అందించాలని ఉద్యానవనశాఖ నిర్ణయించింది. ఇందుకు 1,200 మంది రైతులు సబ్సిడీ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో ఇప్పటి వరకు 675 ఎకరాలకు మంజూరు లభించగా 450 ఎకరాలకు సంబంధించి రైతులకు అందిస్తూ వస్తున్నారు. పక్షం రోజుల్లో పూర్తి స్థాయిలో అందించే అవకాశం ఉందని అధికారులు వెల్లడిస్తున్నారు.

అరటి, బొప్పాయిలకు స్వస్తి

అన్ని రకాల పంటలకు ప్రభుత్వం డ్రిప్ పరికరాలను సబ్సిడీపై అందిస్తూ వచ్చినా రెండేళ్లుగా దీన్ని నిర్ణీత పండ్ల తోటలకు మాత్రమే పరిమితం చేసింది. పండ్ల తోటల్లో అరటి, బొప్పాయికి స్ప్రింక్లర్ల సదుపాయం కల్పించేందుకు స్వస్తి చెప్పింది. జామ, మామిడి, డ్రాగన్, అంజీర, సపోట పంటలకే అందిస్తోంది. అది కూడా పరిమితంగానే ఇస్తోంది. ఉపాధి హామీ పథకం కింద జిల్లాలో కేవలం 1,700 ఎకరాలకే అందించాలని నిర్ణయించింది. ఇందులో కేవలం 250 ఎకరాలకు మాత్రమే మంజూరు లభించింది.

ప్రైవేటుగా పరికరాల కొనుగోళ్లు

ప్రభుత్వం సబ్సిడీపై డ్రిప్ పరికరాల సరఫరాను నిలిపివేయడంతో రైతులు విధిలేని పరిస్థితుల్లో ప్రైవేటుగా కొనుగోలు చేసుకుంటున్నారు. ఇందుకు ఎకరాకు డ్రిప్ రూ.15 నుంచి రూ.20 వేల వరకు ఖర్చు చేయాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు.

ఐదేళ్లుగా ఎదురు చూస్తున్నా



ఐదేళ్ల క్రితం డ్రిప్ పరికరాల కోసం దరఖాస్తు చేసుకున్నా. ఇందు కోసం డీడీ సైతం చెల్లించా. అయినా ఇప్పటి వరకు పరికరాలు అందలేదు. ప్రభుత్వాధికారులు స్పందించి త్వరితగతిన సమస్యను పరిష్కరించి పరికరాలు అందజేయాలి.

– నర్సింహా చారి, రైతు, గొల్లూరుగూడ

దరఖాస్తులు తీసుకోవడం లేదు



ప్రస్తుతం ఆయిల్ పామ్ సాగుకే డ్రిప్ పథకాన్ని అందిస్తున్నాం. అందువల్లే దరఖాస్తులు తీసుకోవడం లేదు. సుమారు 2,500 మేర దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఆయిల్‌పామ్ కోసం 675 ఎకరాలకు డ్రిప్‌ను మంజూరు చేశాం. వచ్చే ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం డ్రిప్‌కు నిధులు కేటాయిస్తే అందిస్తాం.

– అశోక్, ఉద్యానశాఖ అధికారి, చేవెళ్ల డివిజన్

13న కార్గో పార్సిల్ వేలం

షాద్‌నగర్‌రూరల్: తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(టీఎస్ ఆర్టీసీ) షాద్‌నగర్ డిపోలో కొన్ని నెలలుగా తీసుకువెళ్లకుండా ఉన్న కార్గో పార్సిల్‌లోని వస్తువులను ఈ నెల 13న వేలం వేయనున్నట్లు డీఎం ఉష గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. డిపోలో కార్గో పార్సిల్, కొరియర్ కౌంటర్‌లో కొంత కాలంగా ఉన్న వస్తువులను ఉదయం 10 గంటలకు వేలం వేయనున్నట్లు వివరించారు. ఈ వేలంలో పాల్గొనేవారు డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ శ్రీనివాస్‌ను (9154298615) ఫోన్ ద్వారా సంప్రదించాలని సూచించారు.

ఇద్దరు పిల్లలతో కలిసి తల్లి అదృశ్యం

తలకొండపల్లి: తన ఇద్దరి పిల్లలతో కలిసి తల్లి అదృశ్యమైన సంఘటన చోటు చేసుకుంది. ఏఎస్ఐ సీతారాంరెడ్డి చెప్పిన ప్రకారం.. మండల పరిధిలోని పెద్దూర్ తండాకు చెందిన ముడావత్ బుజ్జి, శ్రీను భార్యాభర్తలు. వీరికి నలుగురు సంతానం. వారం రోజుల క్రితం బుజ్జి తన ఇద్దరు పిల్లలైన జయంత్ (10), సంగీత (14)లతో కలసి ఇంటి నుంచి వెళ్లి నేటికీ తిరిగి రాలేదు. దీంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు ఎక్కడ వెతికినా ఆచూకీ లభించలేదు. గురువారం బుజ్జి తమ్ముడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు చెప్పారు. ఆచూకీ తెలిసిన వారు 9989820921, 9440900909 నంబర్‌కు ఫోన్ చేయాలని ఏఎస్ఐ కోరారు.

సేవాలాల్ జయంతిని సెలవు ప్రకటించాలి

సేవాలాల్ సేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రఘురాం రాథోడ్



కందుకూరులో సమావేశమైన సేవాలాల్ సేన నాయకులు

కందుకూరు: సంత్‌శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతి ఫిబ్రవరి 15న రాష్ట్ర ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలని సేవాలాల్ సేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రఘురాం రాథోడ్, ఉపాధ్యక్షుడు భీంలాల్‌పవార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం మండల కేంద్రంలో సేవాలాల్ సేన ఆధ్వర్యంలో అన్ని తండాల ముఖ్య నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సేవాలాల్ మహారాజ్ జయంతిని అధికారకంగా నిర్వహించాలన్నారు. ఆ రోజు మండల కేంద్రంలో నిర్వహించనున్న జయంతి ఉత్సవాలు, శోభాయాత్రను విజయవంతం చేసేలా తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో సేవాలాల్ సేన జిల్లా ప్రధానకార్యదర్శి కొర్ర రాజునాయక్, స్టీరింగ్ కమిటీ సభ్యులు మోహన్‌నాయక్, రవినాయక్, భాస్కర్‌నాయక్, బన్సీలాల్‌నాయక్, బజ్జు నాయక్, శంకర్‌నాయక్, నరేందర్‌నాయక్, విస్లావత్ శ్రీనునాయక్, రమేష్ నాయక్, ఉపేందర్‌నాయక్, చత్రునాయక్, మల్లేష్‌నాయక్, బిక్కునాయక్, జగన్‌నాయక్, దేవిసింఘ్‌నాయక్, శ్రీనునాయక్ పాల్గొన్నారు.

కొనుగోలుదారుడే నిందితుడు

- రోజు టీ తాగే దుకాణానికి కన్నం
- రూ.50 వేల నగదు, సిగరెట్లు, ఇతర సామగ్రి చోరీ

చేవెళ్ల: రోజు టీ, సిగరేట్ తాగేందుకు వచ్చే వ్యక్తి అదే దుకాణానికి కన్నం వేశాడు. ఈ ఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్‌కు సమీపంలోని ఓ టీ స్టాల్‌లో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. మండల కేంద్రంలోని ఠాణా ఎదుట రోడ్డు పక్కన ఓ చిన్న డబ్బాలో జగన్ కొన్నేళ్లుగా టీ స్టాల్ నిర్వహిస్తున్నాడు. ఆ దుకాణ యజమాని రోజు మాదిరిగానే రాత్రి దుకాణానికి తాళం వేసి ఇంటికి వెళ్లాడు. గమనించిన దొంగ అర్ధరాత్రి టీ స్టాల్ తాళం పగులగొట్టి అందులో ఉన్న రూ.50వేల నగదు, సిగరెట్లు, ఇతర సామగ్రిని ఎత్తుకెళ్లాడు. గురువారం ఉదయం షాపు తీసేందుకు వచ్చిన జగన్ తాళం పగుళగొట్టినట్లు గుర్తించాడు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు చుట్టుపక్కల సీసీ కెమెరాలను పరిశీలించి రోజు అదే టీస్టాల్‌లో టీ తాగే కృష్ణగా గుర్తించారు. పోలీసులు నిందుతుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. జగన్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సూచిక బోర్డును ఢీకొని వ్యక్తి మృతి

షాబాద్: రోడ్డు పక్కనున్న సూచిక బోర్డును ఢీకొట్టి ఓ ద్విచక్ర వాహనదారుడు మృత్యువాత పడ్డాడు. ఈ ఘటన మండల పరిధిలోని మల్లారెడ్డిగూడ గేట్ వద్ద గురువారం చోటు చేసుకుంది. ఎస్ఐ మహేశ్వర్‌రెడ్డి తెలిపిన ప్రకారం... మండల పరిధిలోని సంకెపల్లిగూడ గ్రామానికి చెందిన చిందేటి రంగయ్య (55) గురువారం మధ్యాహ్నం స్వగ్రామం నుంచి నాగర్‌గూడకు తన టీవీఎస్ ఎక్సెల్ వాహనంపై వెళ్తున్నాడు. ఈ క్రమంలో మల్లారెడ్డిగూడ స్టేజీ వద్ద రోడ్డు పక్కనున్న సూచిక బోర్డును ఢీకొట్టాడు. ఆయన తలకు బలమైన గాయమవ్వడంతో ఘటనాస్థలిలోనే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఓటర్ల వయసు 123 ఏళ్లు!

- తప్పుల తడకగా జాబితా
- 2071 మంది పుట్టిన తేదీలు తప్పుగా నమోదు
- సవరణలు చేపట్టిన అధికారులు



తప్పుగా నమోదైన ఓటరు జాబితా

కేశంపేట: ఎన్నికల సంఘం నుంచి విడుదలైన తుది ఓటర్ల జాబితాలో తప్పులు దొర్లాయి. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల సంఘం వారు జనవరి 6న ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల చేశారు. గురువారం తుదిజాబితా ప్రకటించారు. కేశంపేట మండలానికి సంబంధించిన జాబితాలో తప్పులున్నట్లు గుర్తించారు. చాలా మంది పుట్టిన తేదీలను అధికారులు తప్పుగా నమోదు చేశారు. సుమారు 2,071మంది ఓటర్ల పుట్టిన తేదీని 01.01.1900గా నమోదు చేశారు. అయితే జాబితాలో ఓటరు పేరు, పోలింగ్ బూత్ నెంబర్లు, ఇంటి నెంబర్ వంటి వివరాలు సరిగానే ఉన్నా.. ఒక్కొక్కరి వయస్సును 123 ఏళ్లుగా నమోదు చేశారు. ఈ జాబితాను పరిశీలించిన ఓటర్లు వెంటనే బీఎల్‌ఓలకు ఫిర్యాదు చేశారు. స్పందించిన అధికారులు ఓటర్ల నుంచి ఆధార్‌కార్డులు సేకరించి ఫాం–8 ద్వారా సవరణకు చర్యలు చేపట్టారు.

నకిలీ పత్రాలు సృష్టించి..

- స్థలం కాజేసేందుకు యత్నం
- ఇద్దరు నిందితుల రిమాండ్ పరారీలో మరో నలుగురు

రాజేంద్రనగర్: అమెరికాలో ఉంటున్న వ్యక్తికి సంబంధించిన విలువైన స్థలాన్ని నకిలీ దస్తావేజులతో ఇతరులకు విక్రయించేందుకు ప్రయత్నించిన ఇద్దరిని రాజేంద్రనగర్ పోలీసులు గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వీరికి సహకరించిన మరో నలుగురు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీనివాస్‌రావు అమెరికాలో ఉంటున్నాడు. కాగా గతంలో రాజేంద్రనగర్ మండలం బుద్వేల్ సర్వే నంబర్ 88లో జన చైతన్య హౌసింగ్ సొసైటీ నుంచి 400ల గజాల స్థలాన్ని కొనుగోలు చేశాడు. సొసైటీ 211 ఫ్లాట్‌ను శ్రీనివాస్‌కు కేటాయించింది. అప్పటి నుంచి శ్రీనివాస్ ఈ ఫ్లాట్‌ను తన స్వాధీనంలోకి తీసుకున్నాడు. గత నాలుగేళ్లుగా యజమాని వద్దకు రాలేదు. ఇదే అదునుగా భావించిన కుర్మగూడకు చెందిన సుదర్శన్ (64), పాతబస్తీ ఉప్పుగూడ హనుమాన్‌నగర్‌కు చెందిన కె.చంద్రశేఖర్ (48)తో పాటు మరో నలుగురు కలిసి శ్రీనివాస్ పేరిట ఆధార్‌కార్డు, ఇతర నకిలీ డాక్యుమెంట్లను సృష్టించారు. డెత్ సర్టిఫికెట్లు సైతం సృష్టించి మరో మహిళను సృష్టించారు. ఈ స్థలాన్ని ఇతరుల పేరుపై రిజిస్ట్రేషన్ చేసేందుకు రాజేంద్రనగర్ సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వచ్చారు. సబ్ రిజిస్ట్రార్ అనుమానంతో రిజిస్ట్రేషన్‌ను ఆపి వేసి డాక్యుమెంట్‌లో శ్రీనివాస్ చిరునామాకు లేఖ రాశారు. దీంతో స్పందించిన శ్రీనివాస్ రాజేంద్రనగర్ సబ్ రిజిస్ట్రార్‌ను కలిసి పూర్తి దస్తావేజులను సమర్పించారు. సబ్ రిజిస్ట్రార్ ఆదేశాల మేరకు రాజేంద్రనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గురువారం సుదర్శన్, చంద్రశేఖర్‌లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మరో నలుగురు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

గంజాయి ముఠా ఆటకట్టు

అత్తాపూర్: గంజాయి విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తుల ముఠాను గురువారం శంషాబాద్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేసి వారి నుంచి 1.38 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ జి.దేవేందర్ రావు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. శంషాబాద్ ఎక్సైజ్ పోలీసులు బుధవారం సాయంత్రం శాతంరాయి ధర్మకాంట సర్వీసు రోడ్డుపై వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నారు. అదే సమయంలో బైక్‌పై వెళుతున్న కాటేదాన్ ప్రాంతానికి చెందిన రాజు సింగ్‌ను ఆపి తనిఖీ చేయగా 440 గ్రాముల గంజాయి లభించింది. దీంతో అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా మరో ఇద్దరి కలిసి ఈ దందా చేస్తున్నట్లు తెలిపాడు. అతడు ఇచ్చిన సమాచారంతో పోలీసులు రాజేంద్రనగర్ దానమ్మ జోపిడీ లో ఉంటున్న శివశంకర్ షా, వికాస్ కుమార్ ఇళ్లల్లో సోదాలు చేసి 940 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. తాము బీహార్‌కు చెందిన వ్యక్తి నుంచి కిలో రూ.10 వేల చొప్పున కొనుగోలు చేసి నగరంలో అవసరమైన రూ.18 వేలకు విక్రయిస్తున్నట్లు తెలిపారు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

‘కార్పొరేట్’లో వేధింపులు!

బాలికలపై లైంగిక దాడులు

- ఆందోళన చెందుతున్న తల్లిదండ్రులు



బడంగ్‌పేట్: ప్రైవేట్ పాఠశాలలు, కార్పొరేట్ స్కూళ్లల్లో ఫీజుల దోపిడీతో పాటు, లైంగిక వేధింపులు సైతం ఎక్కువవుతున్నాయి. ఇటీవల వెలుగు చూసిన పలు సంఘటనలు ఇందుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. విద్యాబుద్ధులు నేర్పించి, తమ పిల్లలకు మెరుగైన బోధన అందిస్తారనే ఉద్దేశంతో వేలాది రూపాయల ఫీజులు చెల్లించి ప్రైవేటు స్కూళ్లలో చేర్పిస్తే.. కొంత మంది సిబ్బంది విద్యార్థినుల పట్ల అమానుషంగా ప్రవర్తిస్తున్న తీరు తల్లిదండ్రులకు ఆందోళన కలిగిస్తోంది. బడంగ్‌పేట కార్పొరేషన్ పరిధిలోని నాదర్‌గుల్‌లో ఉన్న ఓ కార్పొరేట్ పాఠశాలలో ఓ విద్యార్థినిపై ఆ పాఠశాల పీఈటీ లైంగిక వేధింపులకు పాల్పడిన సంఘటన వెలుగులోకి వచ్చింది. విషయం తెలిసిన తల్లితండ్రులు యాజమాన్యాన్ని సంప్రదించినా చర్యలు తీసుకోకపోవడంతో వారు పోలీసులను ఆశ్రయించినట్లు తెలిసింది. ఈ కార్పొరేట్ పాఠశాలలో ఇటువంటి ఘటనలు ఆదిబట్ల, మీర్‌పేట్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో గతంలోనే చాలా చోటుచేసుకున్నట్లు పోలీస్ రికార్డులు చెబుతున్నాయి. డబ్బులతో మీడియాను కవర్ చేసుకుంటూ.. బడా విద్యా సంస్థలు నడిపిస్తున్నారని అందరికి తెలిసిందే. బడాబాబుల పిల్లలను చదివిస్తుండటం, పేరెంట్స్ రాజకీయంగా, ఆర్థికంగా బలంగా ఉన్నవారవడం, ఉన్నత ఉద్యోగాలు చేస్తుండటంతో తమ పిల్లల విషయం బయటకు తెలిస్తే పరువుకు భంగం వాటిల్లితుందనే కారణంగా ఈ విషయాలను గేటు దాటనివ్వడం లేదని పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు చెబుతున్నారు. పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలు స్థానిక రాజకీయ నాయకులతో సన్నిహితంగా ఉంటూ.. ఏదైనా ఘటన జరిగితే ఆ నాయకులే ఆయా పాఠశాలలు, కళాశాలల తరపున రంగంలోకి దిగడం షరా మాములయింది. ఇప్పటికైనా పోలీసులు విచారణ జరిపి దోషిని కఠినంగా శిక్షించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. కార్పొరేషన్ పరిధిలోని పాఠశాలలన్నింటిలో పోలీసులు చట్టాలపై అవగాహన కల్పించి అండగా ఉంటామనే భరోసా కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

పీఈటీకి రిమాండ్

ఇబ్రహీంపట్నం రూరల్: బాలికను లైంగిక ంగా వేధిస్తున్న ఓ పీఈటీని గురువారం రిమాండ్‌కు తరలించారు. ఈ సంఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఆదిబట్ల ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపిన ప్రకారం.. నాదర్‌గుల్‌లో ఓ ప్రైవేట్ స్కూల్‌లో బీఎన్‌రెడ్డికి చెందిన పదమూడేళ్ల బాలిక 8వ తరగతి చదువుతోంది. అదే పాఠశాలలో పీఈటీగా పని చేస్తున్న జయప్రకాష్ నిత్యం బాలికను లైంగికంగా వేధింపులకు గురి చేస్తున్నాడు. తనకు ఫోన్ చేయాలని, బయట తిరగాలని చెప్పేవాడు. ఈ విషయం బాలిక తల్లిదండ్రులకు చెప్పడంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి పీఈటీని రిమాండ్‌కు తరలించారు.

ధర్నా చేపట్టిన ఎస్ఎఫ్ఐ నాయకులు

నాదర్‌గుల్‌లోని ఓ ప్రైవేట్ స్కూల్ ఎదుట ఎస్ఎస్‌యూఐ నాయకులు ధర్నాకు దిగారు. బాలికను వేధింపులకు గురిచేసిన టీచర్‌పై చర్యలు తీసుకోవాలని, పాఠశాల గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు రంగం ప్రవేశం చేయడంతో ఆందోళన విరమించారు.